# గులాబీ గర్వభంగం

కవుజ్వారి



మా ఊళ్లో శ్రీమతి యం. రావును తెలీని వాళ్లుండరు. ఇంగ్లీషులో చెప్పాలంటే ఆమె ఓ పబ్లిక్ ఫిగర్. శ్రీమతి రావుగారు బైటకు వచ్చారన గానే ఆ చుట్టుపక్కలగాలే మారిపోతుంది. అంతా ఆర్భాటంగానూ, హడావుడిగానూ వుంటుంది. ఆమె ఒయ్యారపు నడకలు. హొయలు. టిప్‌టాప్ వేషమూ ఆమె అంతస్తుకూ హోదాకూ సూచిక. గిట్టనివాళ్ళు ఆమె ఒట్టి అహంభావి అంటారు. పలుగురి దృష్టినీ ఆకర్షించాలనేది ఆమె అభిలాష. ఆమె ఏ బజారో వచ్చినప్పుడు, ఆమెనెవరూ చూడకపోతే, తనకెంతో అవమానం జరిగినట్టు భావిస్తుంది—

ఆమె లక్షాధికారిబిడ్డ. అడిగిందే తడవుగా ఓ లక్ష రూపాయిలు పారేసి- స్వయం వరంలో ఓ డాక్టరును ఎంచుకుంది. డాక్టరు రావుగారి శ్రీమతి అయిన తర్వాత ఆమె శ్రీమతి యం. రావుగారై పోయింది. ఆమె అసలు పేరు మంగమ్మ. ఆమె అంటే అసలుగిట్టని వారు 'మిడిసిపాటు మంగమ్మ' అని ముద్దుగా పిలుచుకుంటారు. మంగమ్మ పేరు మొరటుగా వుందని ఫ్యాషన్‌గా ఆమె శ్రీమతి యం. యం. రావునని చెప్పుకుంటుంది.

పల్లెకాని, పట్టణ మూకాని మావూళ్లో, డాక్టర్ రావుకూడా, ప్రాక్టీసు ప్రారంభించిన కొద్ది సంవత్స రాల్లోనే మంచిడాక్టరని పేరు సంపాదించుకున్నాడు. నైపుణ్యం మాట ఎలావున్నా రోగులు ఆయన హస్తవాసి మంచిదన్నారు.

మా ఊళ్లో నాగరీకుల మనుకునే వారు చాల కొద్ది మంది ఉన్నారు. శ్రీమతి యం. రావుగారు కూడా ఆ కొద్దిమంది నాగరీకులలో. ఓస్థానం సంపాదించు కుంది. ఆమెకూడా ఓచిన్న ప్రారంభోపన్యాసమూ, అధ్యక్షోపన్యాసమూ తరచూయిస్తూ, మనసంస్కృతి గురించి పరిశోధన చేసినవ్యక్తికన్నా ఎక్కువగానే మాట్లాడుతూంటుంది. ఆవిధంగా సంఘసేవకు రాలుగా ఆమెపేరు నమోదైంది. అలాంటి సంద ర్భాల్లో, కవిత్వమో, ఏదోరాసేవారెవరినైనా వెదికి పట్టుకుని. వారిచేత సందర్భానుసారంగా ఉప న్యాసం రాయించి, శ్రీమతి గారికి సమర్పించుకునే వరకుకూడా డాక్టరు నిద్రయినా పోవడానికివీల్లేదు. ఆ విధంగా సతిభక్తి పరాయణుడని డాక్టరుగార్కి మా ఊళ్లొ వాళ్లు ఓ యోగ్యతా పత్రాన్ని యిచ్చే శారు.

శ్రీమతి యం. రావు ఆదేశంపైన, డాక్టరురావు ఓ అందమైన పెద్దభవంతి కట్టించేశాడు. డాక్టరు గారి సంపాదనకా భవంతి నిదర్శన మంటారు మా ఊళ్ళోవాళ్లు, ఆవిధంగా ఆయన ఆదర్శపతిగా మహిళాలోకంలో పేరుపొంద గల్గాడు.

భవంతిచుట్టూ కావలసినంత ఖాళీస్థలముంది. శ్రీమతి యం. రావుగారి అంగీకారంపొంది ఆయన భవనం చుట్టూ మూడుపక్కలా చక్కటి పూల మొక్కల తోటవేయించాడు. రోడ్డు కెదురుగావున్న వైపు గులాబీమొక్కలు వరుసగా వేయించాడు.

డాక్టరు పేద కుటుంటానికి చెందినవాడు. కష్ట పడి చదివి డిగ్రీ సంపాదించుకున్నాడు. సెలవులకు వెళ్లినప్పుడు ఇంటివద్ద కాయకష్టం చేయడం ఆయన కలవాటు, బహుశా ఆ అలవాటు సెల వేసినదేమో, ఈ పూలమొక్కలకు ఉదయమే ఆయన స్వయంగా నీళ్లు పోయటం. కుదుళ్లు తీయడం, వంటి పరువు తక్కువ పనులు చేయడంమొదలుపెట్టాడు! లక్షాధికారికూతురు స్వయ వరంలో ప్రేమకు పాత్రుడైనవాడు కూలివాడు చేసేపనులు చేయడం ఏమిటి? ఈయన వ్యవ హారం చూసిన శ్రీమతి యం. యం. రావుకు. మతిపోయినంత పనైంది. "ఔరా! ఈ రాణిగారి భర్త మొక్కలకు నీరుపోయడమా? ఎంత అవ మానం? ప్రతిష్ఠంతా మంటకలిసి పోయింది." అనుకుంది శ్రీమతి యం. యం. రావుగారు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి, రాణిగారాజ్ఞాపించి నట్లుగా కాక ప్రేమతోనే.

"మీ కెందుకండీ శ్రమ తోట సంగతినే చూచుకుంటాను" అన్నారామె.

"ఓస్! ఈమాత్రానికేనా? మనిషన్న వాడికి కాస్త శరీర శ్రమకూడా అవసరం. ఈ మాత్రం శరీర శ్రమ కూడా లేకపోవడం వల్లనే గుండె జబ్బు మరణా లెక్కువౌతున్నాయి" అని ఆయన వైద్య శాస్త్రంకూడా కాసింతగా చదివాడు.

రాణి గార్కి కాస్త కోపం కల్గింది. ముక్కు పుటాల్లో నుండి కాస్త బుస బుస శబ్దం వస్తోంది. వచ్చే కోపాన్ని ఆపుకుని.

"మీకంత శరీర శ్రమ కావాలనుకుంటే ఏ క్లబ్బుకో వెళ్ళి టెన్నిస్ ఆడకూడదూ?" అంది.

"నాకు టెన్నిస్‌రాకెట్ పుచ్చుకోవడం కూడా రాదాయె"

"ఫర్వాలేదు లెద్దురూ - మొదటనే చదువంతా వచ్చిందా? ఆడుతూంటే అదే వస్తుంది. ఓ టెన్నిస్ రాకెట్టు కొందురూ - మీ స్టేటస్‌కు అది ఉండి తీరాలి"

ఇక డాక్టరు ఏమన గలడు? తనపట్ల శ్రీమతి కున్న ప్రేమకు మురిసిపోయాడు. అప్పటి కప్పుడే 'డార్లింగ్' అని ముద్దు పెట్టుకోవాలను కున్నాడు గాని. యింకా అంత నాగరిక జీవితానికి ఆయన అలవాటు పడక "సరేలే" అన్నాడు.

మరునటి రోజు సూర్యుడు పొడిచేసరికి ఓ నౌకరు ప్రత్యక్షం.

"బాబుగారూ దండాలండి"

"ఏమిరా అబ్బాయ్. జాగ్రత్తగా పెంచగలవా మొక్కలను?"

"పెంచగలను బాబుగారు"

"ఇదివరకెప్పుడైనా తోటమాలిగా పనిచేశావా?"

"నే దండి."

"అయితే ఎలామరి?.... అమ్మగార్ని పిలు"

తోటమాలి అమ్మగార్ని పిలుచుకొచ్చాడు.

"వీడసలు ఎప్పుడూ తోటలో పనిచేయలేదట"

"ఆ సంగతి తెలుసండీ"

"అయితే సరే"

"ఇదేదో బ్రహ్మవిద్యయినట్లు చెప్పటానికేమిటి!

మొక్కలను పీక్లపోయడమూ. కుదుళ్ళు తవ్వడమూ, కాంపౌండులో చెత్తా చెదారం పీకివేయడా వికున్కాడా ప్రత్యేక చదువు కావాలేమిటండీ - మీసంతా చిత్రంగాని - మీ కెందుకు? అంతా నే చేయిస్తాగా" అన్నదమ్మగారు.

బతికిపోయాంరా దేవుడా అనుకున్నాడు తోటమాలి అప్పన్న. దొరికిదొరకని రోజుల్లో నౌకరీ దొరకడం మాటలా మరి!

"సరి సరి. ఏయ్ తోటమాలీ" అని డాక్టరు ఏదో చెప్తోండడం అప్పన్న విననేలేదు.

"అమ్మగారి ఎనక ఎల్లా అయ్యగారూ - తమరేటి సెబుతున్నారో..."

"ఈ గులాబీ మొక్కలున్నయ్ చూశావ్ పూలజాతి మొక్కల్లోనే చాల గొప్పవి. ఇవి మామూలు మొక్కలుకాదు తెలుసా."

"అట్టాగే బాబు"

"అట్టాగే బాబంటున్నావ్; ఏం తెలిసిందని?"

"మీరు సెప్పినారుగా"

"ఏం చెప్పాను?"

"మామూలు మొక్కలుకావని"

"అంత మాత్రంతో అంతా తెలిసినట్టేనా?"

"జాగర్తగా సూడాలనే కదాబాబు"

మామూలు జాగ్రత్తకూడా పనికిరాదు. ఎంతో జాగ్రత్తగా చూడాలి. ఈ గులాబీ మొక్కలు ఈ చుట్టుపక్కల దొరకవు - బెంగుళూరునుండి తెప్పించా"

"అట్టాగా బాబుగారూ!"

"ఈ గులాబీమొక్కల్లో, ఎరుపు, తెలుపు, పసుపు ఆకుపచ్చ ఎరుపూ తెలుపూ - ఇట్లా రకరకాల రంగుల పూలుపూసేవి వున్నాయి ఏమనుకున్నావో."

'గులాబీల్లోకూడా రంగు రంగుల పూలుంటాయా బాబుగారూ!"

"ఆ! ఈ గులాబీ మొక్కలు నాకు పంచప్రాణాలు. మరెల్లా పెంచుతావో!"

"నా పానంకన్నా ఎక్కువగా సూసుకుంటా అయ్యగారు."

"మాటలుచెబితే కాదుమరి"

"నాలుగు రోజులుపోతే నా పనోడితనం మీకే తెలుస్తాదిగా."

"తోటమాలీ అన్నట్టు నీపేరేమిటి?"

"అప్పన్న."

"అప్పన్నా! జాగ్రత్తగా విను. ఈ గులాబీ మొక్కలున్నాయ్ చూశావ్. గులాబీపూలెంత సుకుమారమైనవో మొక్కలూ అంతే సుకుమారమైనవే. మన నాటు పూలమొక్కల్లా మొండిరకమూ, బండరకమూ కావు. ఎట్లా పెంచినా పెరగడానికి. వింటున్నావా?"

"యింటున్నా అయ్యగారు."

"ఈ గులాబీ మొక్కలు పైకి బాగున్నట్టే ఉంటూ, చటుక్కున చచ్చి వూరుకుంటాయి. వాటికి యిష్టం వచ్చినట్లు నీళ్ళుపోస్తే కుదరదు. బలంకోసంకూడా ఎరువు మామూలు పద్ధతిలోవేస్తే పనికిరాదు. తెలిసిందా?"

"తెలిసింది బాబుగారు"—డాక్టరుగారి ధోరణి అప్పన్నకు వింతగా కనపడింది.

"ఏమిటి తెలిసింది నీ తలకాయా? గులాబీ మొక్కకు ఎంత నీరు పోయాలో తెలుసా! ఎరువు ఎలా వెయ్యాలో తెలుసా?

"తెలవదు బాబుగారు."

"మరే! ఊరికే తందానా అంటావెందుకు? గులాబీ మొక్కలకు పేడనీళ్ళు పోస్తే మంచిబలం."

"అలాగా బాబుగారూ!"

"పేడనీళ్ళు బలమన్నారుగదా అని పేడను నీళ్ళల్లో కలిపేసి. ఆ నీళ్ళను వెంటనే మొక్కకు పోస్తే. మొక్కకు పురుగుపట్టేస్తుంది. అలా పోసేవు సుమా?"

"మీరు సెప్పినాక ఎంగుకు పోత్తాను బాబూ?"

"పేడనీళ్ళయితే ఏముంది? పచ్చిపేడయితే ఏముందనుకుని, పచ్చిపేడ వేసినా పురుగుపట్టు కొస్తుంది-తెలిసిందా?"

"సెప్పారుగాబాబు."

"ఏమిటండి - తొమ్మిదైతే. లంచి సంగతే మరచిపోయారేమిటి!" అన్నారు శ్రీమతిరావు.

"లంచ్‌కాదు, బ్రెక్‌ఫాస్టు."

"అదే లెద్దురూ — మాటజారితే ముక్కట్టుకుంటారు." ముఖం చిట్లించుకుంది శ్రీమతిగారు.

"అరె అద్నాయి, గులాబీమొక్కలకు ఆ పేడనీరు ఎలా తయారుచెయ్యాలో, ఎలా వడపోసి. ఎన్నాళ్ళ నిల్వవుంచాలో తర్వాత చెబుతా. వీటి పెంపకోసం పెద్ద పుస్తకం కొన్నాను. నువ్వు మాత్రం ఒళ్ళొంచి పనిచెయ్యి. మొక్కలు అందంగా కత్తిరించడం చేతవునా?"

"రాదయ్యగారూ."

"తర్వాత చెబుతాలే" అంటూ ఆ రోజుకి తోటమాలికి మొక్కల పెంపకం గురించి పాఠాలు చెప్పడం ముగించి డాక్టరు లోపలికి వెళ్లాడు.

"అమ్మయ్య" అని నిట్టూర్చాడు అప్పన్న.

కొద్దిరోజులు జరిగేటప్పటికి అప్పన్న కిటుకు తెలుసుకున్నాడు. అయ్యగారిదేముంది దేవుళ్లాంటోడు. అమ్మగారి దయ సంపాదించుకోవాలనుకున్నాడు అప్పన్న. అందుకు అప్పన్న ఎక్కువ తంటాలుపడ్డాడు.


తోట అందంగా పెరిగింది. ఏపుగా పెరిగింది. రకరకాల పూల మొక్కలు ఏపుగా పెరిగినయ్. గులాబీల మొక్కలును చూడ్డానికి కళ్ళు చాలవు.

డాక్టర్ ఆనందంతో. శ్రీమతి రావుకు తోటంతా చూపుతూ, అప్పన్నపడ్డ శ్రమనూ, వాడి విశ్వాసానీ ప్రశంసించాడు.

"ఇక చాల్లెండి - నా వద్ద అంటే అన్నారుగాని వాడివద్ద అనేరు? వాడు మీ మాటలు వింటే కింద నడుస్తాడా, తాడిచెట్టు ఎక్కి కూర్చుంటాడు. నౌకర్లతో వ్యవహరించడమంటే చేతినాటి చూడడమనుకున్నారా? తోటమీద ఎవరి కళ్ళైనా పడ్తాయి. దిష్టిబొమ్మ కట్టించండి. "అని డాక్టరుగారికి ఓ చిన్న ఆదేశమిచ్చింది.

"అలాగేలే."

* * *



# 2

"అందంగా ఉందన్నావుకదా తోట - రేపు నీ కూడా రానీ అయ్యా." అని గంగ అడిగింది అప్పన్నను.

"బడిలేనిరోజు నొద్దుగానిలే."

"రేపు సెలవేగా."

"అయితే రేపు సందాలతీసుకెళతాలే." అన్నాడు అప్పన్న. చిన్నారి గంగ మనసుతృప్తి పడింది. పస్టుఫారం చదువుకుంటోంది. - తోట చూడాల. ఉబలాట పడుతోంది. - తోటలోనుండి తీసి పార వేయమన్న గడ్డి పూలమొక్కల్లో రెంటిని, అప్పన్న తన గుడిసెముందు ఓ మూల పాతాడు. ఆమొక్క లెలా వున్నాయో చీకట్లోనే చూడడానికి వెళ్ళింది గంగ..."అవీ చప్పున పెరిగితే బాగుండును - నా యిల్లు అందంగా వుంటాది" అనుకుంది గంగ,

పొద్దొడిపినాది. సందాలకోసం ఎనురుచూసి, యిసుకెత్తిపోనాది గంగకు - పక్కింటికి వెళ్ళి రెండు జడలేయించు కున్నాది - తెల్లబట్ట లేసుకుని అయ్యకోసం ఎదురుచూస్తూ, ఎక్కడికీ పోకుండా గుమ్మంలో కూకున్నాది. ముస్తాబైన కూతుర్ని సూసుకుని ముసిలోడు మురిసిపోనాడు. "కలిగున్న ఓ అయ్యకడుపునడితే. గంగను సూడ్డానికి కళ్ళు పాలవుగందా' అనుకున్నాడు అప్పన్న.

గంగ గంతులేస్తూ. అయ్య సెయ్యిచ్చుకుంది. ఇక అప్పన్నకు తన కూతురిగురించి ఆలోచనలు ముసురుకున్నయ్. అయ్యగారికీ, అమ్మగారికీ తన అందమైన గంగిను సూపెడ్తాడు. ఏమిచదువుకుంటున్నదీ చెప్తాడు. పొరుగూళ్ళో కాన్వెంటులో చదువుకుంటున్న డాక్టరుగారి పిల్లలు తన కూతురిని ఎయ్యేయ్యో అడుగుతారు. ఆటన్నింటికీ గంగ పక్కంగా సెప్పేత్తాది- ఈ ఆలోచనలతో అప్పన్న నడుస్తున్నాడు. తోట పెంపకంలో ఎంతోమంది ప్రశంసలు పొందిన అప్పన్న నడకలో ఏదో ఠీవి కనపడుతోంది. ముసలి ముఖంలో పడుచుదనం కన్పిస్తోంది- చెప్పలేని ఆనందం నాట్యం చేస్తోంది. "గంగా - అయ్యగారేదైనా అడిగితే బిక్కమొగం ఎట్టేవు? సురుగ్గా, సక్కంగాసెప్పు."

"అట్టనే అయ్యా"

గంగ లేతమనసు అలలమీద తేలిపోతోంది. పెద్దోల్లు, గొప్పోల్లు, తనను పలకరిస్తారు. తన తెలివిని సూపెట్టాలి - ఏమడుగుతారో ?... ఏదో పిరికితనం - కాన్వెంటు బడిలోసెప్పే సదువెట్టాంటిదో ? తన చదువుకన్నా గొప్పచదువేమో ? అల్లేదన్నా అడిగితే, తనకు తెలీందే ఎట్టా సెప్పేది ? ఒకసారి తన గౌనూ, లంగా బాగున్నాయో లేదో చూసుకుంది - మళ్ళా మనసుకు ధైర్యం చెప్పుకుంది.

అప్పన్న. గంగ. డాక్టరుగారింటికి వెళ్ళారు. ఇంటి గుమ్మంముందు కాసేపు నిల్చున్నారు. ఎంతసేపటికీ లోపలినుండి ఎవరూ రావడంలేదు. "నెమ్మదిగా అరే బయటకొత్తారులే - రా - తోట సూద్దువుగాని" అని కూతురును వెంటబెట్టుకుని రకరకాల పూలమొక్కలను చూపాడు. "అయిగో గులాబీ పూలమొక్కలు అటు పోయిసూడు. - నే నీ పక్కకుపోయి పనిసేసుకుంటా"

"అట్లాగేలే." అని, గులాబీమొక్కల వద్దకు వెళ్ళింది.

"అయ్యో యియ్యన్ని గులాబీపూలే !" అంది ఆశ్చర్యంగా,

"ఆ...సూశావో ఎన్ని రంగులుండాయో - యియ్యి ఈ ఊళ్ళో దొరకవు - ఏటనుకున్నావో ? బెంగుళూరునుండి తెచ్చా." అన్నాడు తానే తెచ్చినట్లు అప్పన్న.

"వాసన లేవేటయ్యా ?

"అంత వాసనుండవులే యియ్యి అందానికే."

"మన గులాబీ మంచివాసన కదయ్యా - ఎంత చక్కటి ఎరుపు"

"అవుననుకో - అయితేఏం, ఒకటేరకంగా - యియ్యిచూడు ఎన్నిరకాలు - ఈటిల్లో పెసిడెంటనీ, మహారాణినీ - ఏంటో పెద్దపెద్దపేర్లు - నాకు నోరు తిరగవు." అమ్మగారు సూత్తే, నోదిపీత్తన్నానని కూకలేత్తారు. పని సేసుకుంటా." అని ఓ మూల అప్పన్న పని చేసుకుంటున్నాడు.

గంగ పూలను వాసన చూస్తూ, తోటలో అటూ యిటూ తిరుగుతూ రకరకాల పుష్పాల పేర్లను తెలుసుకుంటుంది.

డాక్టరుగారి పిల్లలు రారే సూద్దామనుకుంటే

ఇంతలో "ఏయ్‌పిల్లా ఎవరవు నువ్వు ?" అనే కేక విన్పించింది. గంగ గుండె ఆగినంతపనైంది. "అప్పన్న కూతుర్నండి" అంది గంగ తేరుకున్న తర్వాత. ఆ కేకేసిన మనిషి అమ్మగారిలా లేదు. గంగ వేయివరహాల చెట్టువద్దకు వెళ్ళి వేయి వరహాల గుత్తిని కోసి తలలో పెట్టుకుంది. తర్వాత ఆ చిన్ని గంగ గులాబీమీద మోజుపడింది— గులాబీ మొక్కవద్దకువెళ్ళి ఓ పచ్చ గులాబీపూవు కోసి. తలలో పెట్టుకోబోతుండగా, చూడాల్సిన వారే చూశారు. దాంతో శ్రీమతి యం. యం. రావుగారెప్పుడు చూసిందో రాకెట్టులా దూసుకు వచ్చి, "ఎవతెవే, పాడుపిల్ల—పువ్వులన్నీ కోసేస్తున్నావ్—అప్పన్నగాడెక్కడ చచ్చాడు?" అంటూ గంగను ఆ దవడా ఈ దవడా వాయించేసింది. శ్రీమతి యం. యం. రావుగారి కోపం యింకా తీరక "నీ చేతులు విరిగిపోను — చెప్పు ఎవరి పిల్లవో? అప్పన్నా, అరే అప్పన్నా" అంటూ మళ్ళా రెండు తగిలించింది.

అమ్మగారి కేకలువిని, భయ భయంగా అప్పన్న పరుగెత్తికొచ్చాడు.

"ఎక్కడ చచ్చావ్? ఏం కాపలారా నీది? రోజూ యిట్టాగే కాపలా కాస్తున్నావా?"

"ఏమైందండమ్మగారు?" అని వణికిపోతూ అమ్మగారినడిగాడు

"ఏమవడం వేమిటి? ఈ పాడుపిల్ల ఎన్ని రోజులనుండి పువ్వులు కోసుకు పోతోందోఏమో? చూడు ఎన్ని పూలుకోసి తలలో పెట్టుకుందో? అయ్యి చాలక గులాబీపువ్వుకూడా కోసింది. దీని సొంత తోటాయిది? దీన్ని తోటలోకెట్టేయి" అంటూ ఊపిరి సలపకుండా పురాణం చదివేసింది.

"అమ్మగారూ తప్పయి పోనాదండి. ఇది నా కూతురు. తోటసూత్తానంటే ఎంట ఎట్టుకొచ్చాను - ఎప్పుడూ సేయనియదవ పనిసేసి. మచ్చతెచ్చినాది- ఎదవముండ" అంటూ ఆ వేశంతో గంగను బాదేశాడు. "ఎప్పుడూ సేయనయ్యా" అంటూ విలవిలా ఏడ్చింది గంగ.

"కావాలంటే అమ్మగారినడిగి కోసుకోపోయావా ? తప్పయిపోయిందమ్మగారూ ?" అని శ్రీమతి యం. యం. రావును బతిమాలుకున్నాడు.


"ముందుపని కానియ్ - ఎక్కడపడితే అక్కడ ఈ గడ్డిమొక్కలేమిటి ? పీకి పారేయక ?" - అప్పన్నను కనిపెట్టటానికసలువచ్చిన ఆమె దృష్టి మళ్ళా గడ్డిపూలపై పడింది.

"అది గడ్డి గులాబీ అంటండీ పూలు బాగున్నాయండీ, ఎర్రగా"

"ఆ మాత్రం మాకూ తెలుసులే - గడ్డిగులాబీ అంట గడ్డిగులాబీ. యివి మా భవనంలోనూ తోటలోనూ ఉండవలసినవేనా ? నీకా మాత్రం తెలియక్కర్లా ? మహారాణుల్లాంటి జాతి పువ్వులమధ్య అలగారకం జాతి పువ్వులా ? పెంటకుప్పలమీదా, అలగా జనం యిళ్ళల్లోనూ ఉండవలసిన పూలు మా లాంటి వాళ్ళ భవనాల్లోనా ఏసేది ? పీకి అవతల పారెయ్."

"అలాగే నమ్మగారు."

"ఈ గడ్డిపూలు మా మొండివి. పీకేసినా, మళ్ళా మొలుస్తాయి. జాగ్రత్త. పీకేసిన తర్వాత, ఆ చోటులో మంటబెట్టు - అప్పుడుకాని ఆ ఈ జాతి మొక్కలు చావవు - యిప్పటికైనా చెప్పిన పని చేయి"



పంతులుగారికి ఆరోజు పనిలేదు. క్లాస్ పుస్తకాలింకా రాలేదు. అందుకనీ .... కాలక్షేపం కోసం విద్యార్థులూ.

"మీరు మనిషికో ప్రశ్న చొప్పున వెయ్యండి. నేను ఒక్కడినే ఎందరి ప్రశ్నలకు ఎలా సమాధానాలు చెపుతానో చూడండి" అన్నాడు.

"సార్....ఒకఔన్సు సిరాబుడ్డిలో ఎన్నిఫుల్‌స్టాప్‌లకి లేకపోతే ఎన్నికామాలకు సరిపోయే సిరావుంటుంది" అని ప్రశ్నవేసింది ఒకమ్మాయి.

"అదేటండి - ఎందుకు సేయనమ్మగారు"

గంగ ఏం చేయగలదు? వెక్కి వెక్కి ఏడుస్తూ అయ్య రాకకోసం నిరీక్షిస్తూ గంగ మునగ తీసుకొని చెట్టుమాటున శూన్యంగా చూస్తూ విల్చునిపోయింది.

పూల జాతుల్లోకూడా, అంతస్తులుంటాయనీ, గౌరవించవలసినవీ, హీనంగా చూడాల్సినవీ వుంటాయనీ యిప్పుడే తెలుసుకున్నాడు అప్పన్న.

ఓ గడ్డిపూల గుబురును పెరుకుదామని అప్పన్న చేయివేశాడు. కానితన చేతులందుకు నిరాకరించాయి. అతని మనసు అదోలా వుంది. యింతలో చీకటి పడింది.

దీనంగా తండ్రీ కూతురూ యింటిముఖం పట్టారు. ఏవేవో సందేహాలు చిన్ని గంగ మనసులో దోబూచులాడుతున్నయ్. తండ్రి నడిగితే తప్పేమీ లేదనుకుంది.

"అయ్యా, ఓటడుగుతాను - కోంపడక సెపుతావా?"

"ఎందుకు కోంపడతా తల్లీ - ఇందాక పిచ్చి కోపంలో ఏదో గొడ్డులా కొట్టాను కాని నా సిట్టి తల్లిని-"నీకేటి బెదురు? యిట్టంవచ్చినన్ని అడుగు"

"ఎప్పుడూ, ఈ తోట మన తోటన్నట్టు సెపుతావేమరి?"

'ఏవోనమ్మా - ఆ తోటకు సేసిన సాకిరీ అట్టాటిది - ఆ తోట నాకు రెండో పానమైపోనాది."

"ఈ తోటలో మనకేమీ లేదా?"

"మనకేటుంటాది?"

"మనకేటి నేకపోవడమేటి? మొక్కలకు నీలోసింది నువ్వు. కుదుళ్లతీసేది నువ్వు - బలంఏసేది నువ్వు. పొద్దాదిసింది మొదలు, పొద్దుకూకేవరకు కష్టపడే నీకు ఏటికాకపోవడమేటి?" అని అమాయకంగా అడిగింది. నిజంగానే అప్పన్న మాటలు గంగకు ఆశ్చర్యంగానే కన్పించాయి.

"మనకేటుందమ్మా - తోట అల్లసొత్తు. ఆరికి యిట్టంలేనపుడు, పొమ్మంటే నేను పోవాల్సిందే - కట్టపడేవోడి బతుకేముందమ్మా? అడి రెక్కలే ఆడికి ఆస్తి." అని భారంగా నిట్టూర్చాడు.

"నువ్వింత కట్టపడి తోటను పెంచినావు కందా, మనేం ఒక పూవైనా కోసుకోకూడదా?"

"ఎర్రితల్లీ - మనకా అదృష్టమెక్కడిది? మనమింత కట్టపడితేగా నెలకు నలభై రూపాయిలొచ్చేది."

"ఆ మాత్రం దానికింత కట్టపడి ఆ తోటనెందుకు పెంచావయ్యా? కూలిపనిచేసే వాల్లంతా ఇలాగే సేత్తుండారా?"

"కూలిపనిచేసే వాల్లందరి బతుకులంతే తల్లీ" అని అప్పన్న నిట్టూర్చాడు.

"అన్యాయంగా నన్ను కొట్టినోల్లు బాగుపడి సత్తారేటి? తుడిచిపెట్టుకు పోతారు. ఈ తోట ఉంటాదేటి" అని గంగ అనుకోకుండా కోపంగా అనేసింది.

"తప్పమ్మా - బాలవాక్కు బ్రహ్మవాక్కన్నారు పెద్దోల్లు - అట్టనబాకు తల్లీ - జరిగింది మరసిపో" అని అప్పన్న కూతురిని సముదాయించాడు.

* * *

# 3

రోజులు దొర్లిపోయినయ్ తాను దెబ్బలుతిన్నాతర్వాత గంగ మళ్ళా శ్రీమతి యం. యం. రావు గారి తోటవైపు తొంగిచూడలేదు. గంగ తన గుడిసెముందున్న కొద్దిపాటి స్థలంలో ఓ మూల నాటిని గడ్డి పూలమొక్కలకు రోజూ కాసిన్ని నీళ్లు పోసి పెంచుతున్నాది. అవీ మొగ్గతొడిగి పూయడం మొదలెట్టాయి. ఆ గడ్డిపూలు గంగ కంటికి చాల అందంగా కన్పించాయి. అయ్యయింటికి రాగానే, "సూడు నా సెట్టు పూలు - నీ యమ్మకేకాదు పూల తోటవుంది - నాకూ వుంది పూలతోట - సూడు మరి - ఎంత సక్కంగావుండాయో నా సెట్టుపూలు" అంటూ అప్పన్నతో అనేది.

ఉన్నట్టుండి, ఒకరోజు రాత్రి ఆకాశమంతా కారుమబ్బులు కమ్మివేశాయి, హోరుమని గాలి వీస్తోంది - గాలి చప్పుడు అదు బయటభీకరశబ్దం చేస్తోంది - నిద్రపోతున్న పిల్లల్ని జడిపించడానికా అన్నట్టు, మెరుస్తూ, ఉరుముతూ ఆకాశం గర్జిస్తూంది.

గాఢాంధకారం, హోరుగాలి పెరిగింది. పూరి గుడిసెలపై అసలు లేచేట్టు గాలి తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తోంది. ఆ గాలి సుళ్ళు తిరుగుతూ విపరీత వేగంతో వీస్తోంది. వాన ప్రారంభమైంది. ఆకాశానికి చిల్లు పెడ్డట్టు కుండపోతగా కుంభవర్షం. వీధి దీపాలు పోయినయ్, బయటకు రావడానికి మహా భయంగా వుంది.

గుడిసెలమీద ఒక ఆకైనా లేకుండా లేచిపోయినయ్. ఓ మూల గోడలకంటి పెట్టుకొని గుడిసెల్లో వుండే జనం కాలక్షేపం చేస్తున్నారు.

ఆ గాలీవానా ఓ గంటసేపు సాగింది. గాలి ఆగిపోయింది. ఇంకా మెరుపులూ, ఉరుముల శబ్దమూ ఉన్నామని పిస్తున్నాయ్. వాన జోరు తగ్గింది.

తోట ఏమై పోయిందనే ఆదుర్దాయే అప్పన్నకు -గాలివానా తన తోటను ఏంచేస్తాయో? ఓ మూల కూచుని గొణుగుతున్నాడు. 'నీకు యిల్లు పోయిందని బాదనేదు — ఊరోడి తోట గురించి నీకు బాదొచ్చి పడిపోవాలా? ఏం మదిసివీ, ఏం లోకం? అద్దరాత్రి ఏటి గోల-మాటాడకుండా కునుకుతీయ రాదూ" అని ముసిల్ది అప్పన్నను మందలించింది.

"నీ సేత్తో పెంచనేదు కనక నీకట్టనే అని పిత్తది-నీ కన్నబిడ్డకు కట్టంవత్తే ఎంత బాదడిపోతావు?"

"నోరు కట్టేసి కునుకుతీద్దూ. ఎట్టయితే పెంచినావుగాని మాలావుతోట."

భళ్ళున తెల్లవారింది, చిందర వందరై పోయిన గుడిసెలు, వీధులన్నీ తాటాకులమయం. అప్పన్నకిదంతా పట్టలేదు. తన చేతులతో పెంచిన తోటా ఏమైందో? అప్పన్న తత్తరపాటుతో గబగ నడిచి డాక్టరుగారింటికి వెళ్ళాడు.

మెయిన్‌గేటు వద్దకువచ్చి, అప్పన్న ఒకసారి పరకాయించి చూశాడు. అప్పన్న గుండె గుభేలుమంది. డాక్టరు రావూ, శ్రీమతి యం. యం. రావు గారూ, ధ్వంసమైన పూల తోటను చూస్తున్నారు. శ్రీమతి యం. యం. రావుగారు మొదలెట్టింది. "ఏ పాపిష్టి దాని కళ్ళు పడ్డాయో,పాడుకళ్ళు-తోటంతా నాశనమై పోయింది. పైకి అందరూ మెచ్చుకున్నా, లోపల అందరికీ ఏడుపే"

"ఏం చేస్తాంలే. ఈ గాలివాన మనొక్కరికోసమే వచ్చిందంటలే" డాక్టరు శ్రీమతిని సముదాయిస్తున్నాడు.

"ఒక్క గులాబీమొక్క కూడా పనికి రాదల్లే వుంది." అంది బాధగా.ఆమె రాలిపోయిన గులాబీ పూవును నీటిలోనుండి తీయగానే, పూవు రేకులన్నీ రాలిపోయాయి, తోటంతా గులాబీ పూల రేకులే.

"అయ్యగారు- నా కట్టమంతా ఈనగాచి నక్కల పాలయిపోయింది బాబుగారు" అంటూ అప్పన్న కంటతడి పెట్టాడు. "సూడండి - దేవుడు నన్నెంత అన్యాయం సేశాడో?- ఒక్క గులాబీ మొక్కనైనా ఉంచనేదు."

తోటలో ఏవైనా మొక్కలు దెబ్బ తినకుండా ఉన్నాయేమోనని అప్పన్న ఆశతో తోటంతా కలయచూశాడు.

నీళ్ళలో స్నానంచేసి ఒడ్డుకు చేరినట్లుగా అప్పుడే తమను చూడవచ్చిన వారికి కృతజ్ఞత చెబుతూన్నట్లుగా గడ్డిపూలు, ఈ ముగ్గురిని ఆప్యాయంగా పలకరించినయ్. చిరుగాలికి ఆ గడ్డిపూలు తల లూపుతూ,తమ తలలపైగల నీటి బిందువులలో ప్రతిబింబిస్తున్న సూర్యకిరణాలతో, రంగురంగుల ధగధగలతో నృత్యం చేస్తున్నయ్.

"కొంతనయం. ఈ గడ్డిపూలైనా దక్కాయి" అన్నాడు శ్రీమతితో డాక్టరు.

"చాల్లెద్దురూ. ఎవరైనా వింటే నవ్విపోతారు. మిగిలినయ్‌రే. మాలావు గొప్పమొక్కలు! రాణులు పోతే పోయారుగాని, దాసీ జనమన్నా మిగిలినందుకు సంతోషించాడట వెనకటికి మీలాంటి ఒకరాజు. ఎందుకీ చెత్తరకం? రాండిపోదాం" అన్నారు శ్రీమతి యం. యం. రావుగారు.

చిన్ని గంగ తన గడ్డిపూల మొక్కలిచ్చిన పూలను తలలో సింగారించుకుంది. తన అయ్య తోట ఎలా వుందో చూడాలని బుద్ధిపుట్టి, డాక్టరు గారింటికి వచ్చి గేటుముందు నిల్చుంది. ఆమెకు చిన్నాభిన్నమై చిన్నబోయిన తోట, విచారంగావున్న అయ్య, డాక్టరు, ఏదో కన్పించని ద్వేషాన్ని కక్కుతున్న శ్రీమతి యం. యం. రావు కనబడ్డారు.

*